


సాక్షి ఒడిశా

బుధవారం ၊ 12 ၊ జూలై ၊ 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,70,561లు, బంగారం 4 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 56 గ్రాముల 200మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



'ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'

- 8లో



ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

- 8లో

న్యూస్‌రీల్

దోపిడీ దొంగ అరెస్టు



దొంగతో సహా స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా కొదలా బ్లాక్ గోకన్‌పూర్ గ్రామంలో జరిగిన దోపిడీ ఘటనలో దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి బసంత్ కుమార్ సెఠి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి గ్రామంలోని ప్రమోద్ కుమార్ పాణిగ్రహి ఇంటిలో చోరీ జరిగింది. ఇంటిలోని బీరువా పగలుగొట్టి బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు దోచుకొని దొంగ పరారయ్యాడు. దీంతో బాధితుడు ప్రమోద్ కుమార్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు దొంగను మంగళవారం అరెస్టు చేశారు. అతడి వద్దనుంచి 35.290 గ్రాముల బంగారం, సెల్‌ఫోన్, కత్తి, 3 బాంబులను స్వాధీనం చేసుకున్నారు.

పలు రైళ్లు రద్దు



పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న వాల్తేర్ డీఆర్ఎం అనుప్ కమార్ సత్పతి

కొరాపుట్: కొత్తవలస – కిరండోల్ రైల్వే లైన్‌లో కొరాపుట్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. కరకవలస–బొర్రా గుహల మధ్య ట్రాక్ మీద రాళ్లు విరిగిపడడంతో ఈ చర్యలు తీసుకున్నారు. 18514 నంబర్ గల విశాఖపట్నం–కిరండోల్ ఎక్స్‌ప్రెస్, 18513 నంబర్ గల కిరండోల్–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 08551 నంబర్ విశాఖపట్నం–కిరండోల్ ప్యాసింజర్, 08552 నంబర్ కిరండోల్–విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లను ఈనెల 14వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో రాళ్లు పడిన ప్రాంతాన్ని వాల్తేర్ డివిజనల్ మేనేజర్ అనుప్ కుమార్ సత్పతి సందర్శించారు. ట్రాక్ పునరుద్ధరణ పనులు పరిశీలించారు.

'ఉపాధి అవకాశాలు కల్పించాలి'



మాట్లాడుతున్న సాబొరొ

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే దేశంలో నిరుద్యోగ సమస్య నిర్మూలించడం సాధ్యమవుతుందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాయగడ జిల్లా శాఖ అధ్యక్షుడు సంజీవ్ సాబొరొ అన్నారు. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి లుంగురుతల గ్రామంలో జిల్లాస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు లేకపోవడంతో విద్యార్థులు నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పగలిగితే ఉపాధి అవకాశాలు మెరగుపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి విద్యార్థుల సమస్యలపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు తిరుపతి గొమాంగొ, విద్యార్థి సంఘం నాయకుడు లుటిలాల్ సుబుద్ధి, మహ్మద్ సాహిల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



అరెస్టు చేసినవారిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన చర్చనీయాంశంగా మారింది. ఎస్పీ సర్వాణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గుసానినువాగం పోలీసుస్టేషన్ పరిధి శక్తి నగర్ 5వ లైన్‌లోని ఒక అపార్ట్‌మెంట్ నుంచి అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించి 4 బస్తాల్లో నిల్వ ఉంచిన 84 కిలోల గంజాయితో పాటు ఒక ఆధునిక యంత్రం, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో బీహార్‌కు చెందిన తార ప్రసాద్ రథ్ (46), రాజస్థాన్‌కి చెందిన దెబసిస్ నాయక్ (26), గంజాం జిల్లా ఛత్రపూర్‌కి చెందిన బినాయక్ కుమారు (29)లు ఉన్నట్లు వెల్లడించారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి



వర్చువల్‌గా మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

- సీఎం నవీన్ పట్నాయక్
- డిగ్రీ చదివేవారికి రూ.50 వేలు సాయం

భువనేశ్వర్: రాష్ట్రంలో గిరిజనుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. మంగళవారం జరిగిన గిరిజనుల సలహా మండలి సమావేశంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్య, జీవనోపాధి మరియు హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గిరిజన ప్రజల భాగస్వామ్యంతో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం గుర్తింపు ప్రచారం, రక్షణ మరియు పరిరక్షణపై దృష్టి సారించడానికి ప్రత్యేక అభివృద్ధి మండలిలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. ఈ సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ఏదైనా ప్రభుత్వ సంస్థలో సాధారణ డిగ్రీ కోర్సును అభ్యసించే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50,000 ఏకవిడత ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. దీని ద్వారా సుమారు 84 లక్షల మందికి పైగా గిరిజన ప్రజలు లబ్ధి పొందుతారని తెలియజేశారు.

వసతుల కల్పనలో అగ్రగామిగా రాష్ట్రం

గిరిజన విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించడంలో ఒడిశా అగ్రగామిగా ఉందన్నారు. ఈ విభాగం అధీనంలో 1,735 పాఠశాలల్లో 4.2 లక్షల కుటుంబాలకు చెందిన 6 లక్షల మందికి పైగా విద్యార్థులు హాస్టల్ సౌకర్యాల లబ్ధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. గత 20 ఏళ్లలో ఎస్టీ, ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలోని ఉన్నత పాఠశాలల సంఖ్య దాదాపు రెట్టింపై 215 నుంచి 422కి చేరుకుందని వెల్లడించారు. అదే విధంగా ఉన్నత మాధ్యమిక విద్యను అందించడానికి 62 హయ్యర్ సెకండరీ పాఠశాలలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఏడాది 23 జిల్లాల్లో 172 మండలాల్లో ప్రత్యేక అభివృద్ధి మండళ్ల కార్యకలాపాలను విస్తరించినట్లు చెప్పారు. అలాగే అర్హులైన దళిత అటవీ నివాసులందరికీ అటవీ భూమిని కలిగి ఉండి జీవించే హక్కును నిర్ధారించడానికి మో జొంగొలొ జొమ్మి యోజన (నా అడవి భూమి పథకం) మరియు ముఖ్యమంత్రి జీవిక (ఉపాధి) మిషన్ అతి పెద్ద ప్రత్యేక గిరిజన జీవనోపాధి ప్రోత్సాహక కార్యక్రమాల్లో ఒకటిగా పేర్కొన్నారు. రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో ఈ పథకం 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభమైందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం వరకు మూడు సంవత్సరాల పాటు నిరవధికంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యవధిలో 121 దళిత మండలాల్లో 1.5 లక్షల గిరిజన కుటుంబాలకు మద్దతు లభిస్తుందని వివరించారు. 2024–25 నుంచి 7 సంవత్సరాల కాలానికి కొత్తగా నోటిఫై చేయబడిన 1,138 పీవీటీజీ గ్రామాల్లో అమలు చేయాలని భారత ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గిరిజనులు సాధికారత మరియు జీవనోపాధి మెరుగుదలకు ఈ ప్రతిపాదన దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిందితుల రిమాండ్ పొడిగింపు

- ముమ్మరంగా ట్రిపుల్ ట్రైన్ ప్రమాదం విచారణ
- సీబీఐ అభ్యర్థనకు కోర్టు అంగీకారం

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్ వద్ద ట్రిపుల్ ట్రైన్స్ యాక్సిడెంట్ కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్‌ను భువనేశ్వర్ ప్రత్యేక సీబీఐ కోర్టు పొడిగించేందుకు అనుమతించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ అభ్యర్థన మేరకు కోర్టు అంగీకారం తెలిపింది. లోగడ జూలై 7న నిందితులకు 5 రోజుల రిమాండ్‌ను కోర్టు మంజూరు చేసింది. రిమాండ్‌ను మరో నాలుగు రోజులు పొడిగించాలని కోర్టుకు దరఖాస్తు చేయడంతో అనుమతించినట్లు మంగళవారం కోర్టు ప్రకటించింది. ఈ సందర్భంగా నిందితులు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (సిగ్నల్) అరుణ్ కుమార్ మహంత, సెక్షన్ ఇంజనీర్ మహ్మద్ అమీర్ ఖాన్ మరియు టెక్నీషియన్ పప్పు కుమార్‌ని కోర్టులో హాజరుపరిచారు.

లోతుగా విచారణ

ఈ దుర్ఘటన వెనక అసలు నిజాలు బట్టబయలు చేసే దిశలో సీబీఐ విచారణ లోతుగా కొనసాగుతోంది. తొలి దశలో ముగ్గురుని అరెస్టు చేసి విచారణ కొనసాగిస్తున్న దర్యాప్తు బృందం తాజాగా మరో ఇద్దరు రైల్వే సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. వీరిలో బహనాగా బజార్ రైల్వేస్టేషను మాస్టర్ ఒకరు. సీబీఐ వీరిని సోమవారం నుంచి విచారించింది. స్టేషను మాస్టరుతో సహా మరో సిబ్బందిని ప్రశ్నించింది. కాగా తాజాగా మరో ముగ్గురికి నోటీసులు జారీ చేసింది. వీరిని బుధవారం నుంచి ప్రశ్నించడం ఆరంభిస్తుంది. ఈ లెక్కన దర్యాప్తు బృందం 8 మందిపై దృష్టి సారించింది. లోగడ ముగ్గురు నిందితులను జూలై 7న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరికి వ్యతిరేకంగా ఐపీసీ సెక్షన్లు 304 (హత్య కాకున్న మరణానికి హేతువు) మరియు 201 (సాక్ష్యాధారాల గల్లంతు) కింద కేసులు నమోదు చేశారు. వీరిలో అరుణ్ కుమార్ మహంత మరియు అమీర్ ఖాన్ బెయిల్ కోసం దరఖాస్తు చేశారు.

సీఆర్ఎస్ విచారణలో...

రైల్వే భద్రతా కమిషనర్ (ఆగ్నేయ సర్కిల్) సీఆర్ఎస్ విచారణ నివేదికలో నార్త్ సిగ్నల్ గూమ్టీ (స్టేషన్) వద్ద సిగ్నలింగ్ సర్క్యూట్ మార్పులో లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పేర్కొంది. జూన్ 2వ తేదీ సాయంత్రం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బహనాగా బజార్ స్టేషన్‌లో స్థిరంగా ఉన్న సరుకు రవాణా రైలును ఢీకొట్టింది. అనంతరం దాని పట్టాలు తప్పిన కొన్ని కోచ్‌లను పక్క ట్రాక్‌పై వస్తున్న యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 293 మంది మరణించారు. ఇప్పటికీ పలువురి ఆచూకీ తెలియక మృతదేహాలు కంటైనర్లలో మగ్గుతున్నాయి. స్థానిక ఎయిమ్స్ ప్రాంగణంలో కంటైనర్లలో 41 శవాలు ఆచూకీ కోసం నిరీక్షిస్తున్నాయి. వీటిలో 10 శవాల డీఎన్ఏ పరీక్షల నివేదిక అందడంతో బంధు వర్గాలకు అప్పగించేందుకు సన్నాహాలు చేపట్టారు. నిబంధనల మేరకు మృతదేహాలను అప్పగిస్తారు. స్వస్థలాలకు తరలించలేని పరిస్థితుల్లో స్థానికంగా అంత్యక్రియలు ఉచితంగా నిర్వహించేందుకు స్థానిక నగర పాలక సంస్థ ఏర్పాట్లు చేసింది.

పిడుగుపడి తల్లీ, కొడుకు దుర్మరణం



తల్లీ, కుమారుల మృతదేహాలపై పడి విలపిస్తున్న కుటుంబ సభ్యులు



హాస్పిటల్‌లో రోదిస్తున్న బంధువులు, గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి అంచల గ్రామంలో పిడుగుపడి ఇద్దరు దుర్మరణం చెందారు. వారిద్దరూ తల్లీ, కుమారులు కావడం దురదృష్టకరం. వివరాల్లోకి వెళ్తే.. అంచల గ్రామానికి చెందిన లింగరాజ్ హలబ తన భార్య దురువతీ హలబ, కుమారుడు దీపక్ హలబలతో కలిసి తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కుండపోత వర్షం ప్రారంభమైంది. లింగరాజ్ వెంటనే సురక్షిత ప్రాంతానికి వెళ్తుండగా, అతడి భార్య, కుమారులు పొలం నుంచి బయటకు వస్తున్న సమయంలో వారిపై పిడుగులు పడ్డాయి. దీంతో తల్లీ, కుమారులు పొలంలోనే పడిపోయారు. వెంటనే వారిని గ్రామస్తుల సహకారంతో బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన డాక్టర్లు వారు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. మరణించిన దీపక్ +2 చదువుతూ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహకరిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. వీరి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

లూటీ చేసిన నిందితుడు అరెస్టు



పట్టుబడిన నిందితుడు భాస్కర్

జయపురం: మల్కన్‌గిరి జిల్లాకు సరుకులు తీసుకెళ్తున్న ఒక ట్రక్కు డ్రైవర్‌పై మారణాయుధాలతో దాడిచేసి, లూటీ చేసిన ఘటనలో జయపురం సదర్ పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. జూన్ 28వ తేదీన ఒక ట్రక్కులో డ్రైవర్ ఉరేష్ సాహు, హెల్పర్ పింటు సాహులు బరంపురం నుంచి మల్కన్‌గిరికి సరుకులు తీసుకెళ్లారు. ఆ సమయంలో విజయవాడ–రాంచీ 326వ జాతీయ రహదారిలో ఒకచోట రాత్రి ట్రక్కు ఆపి పడుకున్నారు. ఆ సమయంలో కొంతమంది దుండగులు ఒక బైక్‌పై వచ్చి మారణాయుధాలు చూపించి డబ్బు, విలువైన వస్తువులు ఇమ్మని డ్రైవర్‌ను బెదిరించారు. వారు వ్యతిరేకించడంతో డ్రైవర్, హెల్పర్లను దారుణంగా కొట్టారు. అనంతరం డ్రైవర్ వద్దనున్న రూ.12,000 నగదు, కొన్ని సామాన్లు లూటీ చేసి పారిపోయారు. అనంతరం స్థానికుల సాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. హెల్పర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు టి.భాస్కర్‌ను అరెస్టు చేసినట్లు ఈశ్వర తండి వెల్లడించారు. అయితే బైక్‌ల దొంగతనం కేసులో విచారిస్తుండగా నిందితుడు ట్రక్కు లూటీ విషయాన్ని తెలిపినట్లు పేర్కొన్నారు.

స్కూటీలో చెలరేగిన మంటలు

- త్రుటిలో తప్పించుకున్న యువకుడు



స్కూటీ నుంచి ఎగిసిపడుతున్న మంటల

జయపురం: రన్నింగ్‌లో ఉన్న స్కూటీలో మంటలు చెలరేగిన ఘటన బొరిగుమ్మ సమితి అవులి కూడలి వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో నవరంగపూర్ ఆర్‌కే కాలనీకి చెందిన అశోక్ సాహు పనిచేస్తున్నాడు. సోమవారం తన స్కూటీపై నవరంగపూర్ నుంచి బొరిగుమ్మ మీదుగా జయపురం బయల్దేరాడు. అతడు నవరంగపూర్ – బొరిగుమ్మ 26వ జాతీయ రహదారిలో బొరిగుమ్మ సమితి అవులి కూడలి వద్దకు వచ్చే సమయానికి స్కూటీ ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే అవులి జంక్షన్‌లో ఉన్నవారు గమనించి అశోక్‌ను బండి ఆపమని అప్రమత్తం చేశారు. అశోక్ బండి ఆపి దిగేసరికి ఒక్కసారిగా స్కూటీ అంతా మంటలు వ్యాపించి ఎగిసిపడ్డాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక విభాగానికి సమాచారం తెలియజేసినా, వాళ్లు వచ్చేటప్పటికే బండి పూర్తిగా దగ్ధమయ్యింది. అశోక్ రెండు నెలల క్రితమే స్కూటీ కొన్నట్లు తెలుస్తోంది. షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పెట్రోలు వాహనం కావడంతో వేగవంతంగా మంటలు వ్యాపించాయి.

కన్యాకుమారి ట్రైన్‌లో మంటలు



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్లో) రైలు నుంచి భయంతో బయటకు దిగుతున్న ప్రయాణికులు

బరంపురం: గంజాం జిల్లా బరంపురం దగ్గర కన్యాకుమారి నుంచి పశ్చిమ బెంగాల్ వెళ్లే సూపర్ ఫాస్ట్ రైలులో మంటలు చెలరేగాయి. ఈస్ట్–కోస్ట్ రైల్వే అధికారులు మరియు బరంపురం సబ్ కలెక్టర్ అశుతోష్ కులకర్ణి తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం కన్యాకుమారి నుంచి పశ్చిమ బెంగాల్ వెళ్తున్న సూపర్ ఫాస్ట్ రైలు 10వ నంబర్ బోగీలో హటాత్తుగా మంటలు వచ్చాయి. అయితే ఆ సమయంలో లోకో పైలెట్ అప్రమత్తమై బండిని వెంటనే స్టేషన్ ఔటర్‌లో నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రయాణికులను దించి, మంటలను అదుపు చేశారు. అనంతరం బండి యథావిధిగా బయల్దేరింది. ఈ ఘటనతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

వేర్వేరు చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు



నిందితుడు సురేష్ నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసు



నిందితుడు అభినాష్ నుంచి స్వాధీనం చేసుకున్న నక్లెస్, నగదు



వృద్ధురాలి మెడలో గొలుసు దొంగిలించిన సురేష్ ముదులి



భూపతివీధిలో నగలు, బంగారం దొంగలించిన నిందితుడు అభినాష్

జయపురం: వేర్వేరు బంగారు నగల దొంగతనాల కేసుల్లో ఇద్దరు నిందితులను జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ పోలీసు అధికారి సంబిత్ కుమార్ బెహర తెలిపిన వివరాల మేరకు.. జూన్‌లో బొడొతెలిసాహి(నీలశైలి కూడలి)లో ఒక వృద్ధురాలు ఉదయం ఇంటి నుంచి పనిపై బయటకు వెళ్లింది. ఆ సమయంలో సినిమా వీధికి చెందిన సురేష్ ముదులి ముఖం కప్పుకొని ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొని పోయాడు. ఆ బంగారు చైన్ విలువ రూ.30,000లు ఉంటుందని వెల్లడించారు. దొంగతనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి ఎట్టకేలకు సోమవారం నిందితుడిని అరెస్టు చేశామని వెల్లడించారు. అతడు ఆమె వద్ద దొంగిలించిన బంగారు నగను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా జూన్ 28వ తేదీన స్థానిక భూపతి వీధికి చెందిన కృతిబాస నాయిక్ భార్య తన బంగారు నక్లెస్, ఉంగరాలు, కొంత డబ్బు ఒక బ్యాగ్‌లో ఉంచింది. తర్వాత నగలు కోసం బేగ్ తెరిచి చూడగా అందులో పెట్టిన నగలు, డబ్బు లేకపోవడం చూసి ఇంట్లో వెతికారు. చివరకు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఎట్టకేలకు నిందితుడు అభినాష్ మహంతిని అరెస్టు చేశారు. అతడు దొంగిలించిన నక్లెస్, రూ.30,000లు స్వాధీన పరచుకున్నట్లు వెల్లడించారు. రెండు దొంగతనాల కేసుల్లో పట్టుబడిన నిందితులను కోర్టుకు పంపామని వెల్లడించారు.

చెరువులో మునిగి ఇద్దరు మృతి



మృతదేహాలను ఒడ్డుకి తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బరంపురం: నగరంలో ఉన్న బిజు పట్నాయక్ పార్క్‌లోని చెరువులో మునిగి ఇద్దరు మృత్యువాత పడిన విషాదకర ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఐఐసీ అధికారి శిబ శంకర్ మహాపాత్రో తెలిపిన వివరాల మేరకు.. టౌన్ పోలీసుస్టేషన్ పరిధి కార్పొరేషన్ రోడ్డులోని బిజు పట్నాయక్ పార్క్ చెరువులో ఇద్దరు మునిగిపోవడంతో వెంటనే పార్క్ సిబ్బంది పోలీసులు, అగ్నిమాపక విభాగానికి సమాచారం ఇచ్చారు. వెంటనే బరంపురం అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం మృతదేహాలను ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే మృతి చెందిన ఇద్దరు వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





చెరువులో మునిగిపోయినవారి మృతదేహాలు

క్లుప్తంగా

సరియాపల్లిలో బొలేరో పల్టీ

- మందస వ్యక్తి మృతి



బోల్తాపడిన బొలేరో వాహనం

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి సరియాపల్లి గ్రామం వద్ద బొలేరో వాహనం రోడ్డు ప్రమాదంలో పల్టీలు కొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో వాహనం డ్రైవర్ బండి కిందపడి చనిపోయాడు. విషయం తెలుసుకుని గురండి పోలీసులు, ఐఐసీ రవీంద్ర కుమార్ పాత్రో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీకాకుళం జిల్లా మందస మండలం పెద్దపాడుకు చెందిన బి.లింగరాజు (33)గా పోలీసులు గుర్తించారు. ఆయన తన వాహనంతో మందస నుంచి పర్లాకిమిడికి వెళ్తుండగా అదుపుతప్పి పొలాల్లో పడిపోయింది. శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమర్టం చేసి మృతుని బంధువులకు అప్పగించారు. గురండి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రోడ్డు నిర్మాణానికి స్థల దానం



నీలకంఠ పాణిగ్రాహి దంపతులకు స్వాగతం పలుకుతున్న గ్రామ సర్పంచ్, పెద్దలు

ఎల్ఎన్ పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని వంశధార తీరంలో ఉన్న శ్రీబంగారమ్మ తల్లి అమ్మవారి గుడికి వెళ్లే దారికి అవసరమయ్యే స్థలాన్ని అదే గ్రామానికి చెందిన నీలకంఠ పాణిగ్రాహి దానం చేశారు. బంగారమ్మ తల్లి ఆలయ ప్రాంగణం వద్ద మంగళవారం ఈ మేరకు అవసరమయ్యే స్థలాన్ని దారి నిర్మాణం కోసం రాసి ఇచ్చారు. ఎంతో విలువైన భూమిని ఆలయానికి దానమిచ్చిన నీలకంఠ పాణిగ్రాహిని సర్పంచ్ ముగడ దివాకర్, శ్రీబంగారు సంతోషి సంస్థల సభ్యులు వైశ్యరాజు చంద్రశేఖరరాజు (పొట్టిరాజు), పాండురంగనాధ రాజు, శ్రీనివాస రాజు, ముగడ జనార్దన, ఉప సర్పంచ్ అశోక్ పాణిగ్రాహి, ఊణ్ణ ఫకీరు, ఒనుమ తిరుమల తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

గల్లంతైన మత్స్యకారుని మృతదేహం లభ్యం

గార: బందరువానిపేట తీరంలో ఆదివారం జరిగిన పడవ బోల్తా ప్రమాదంలో గల్లంతైన గుంటు గణపతి (50) మృతదేహం సంతబొమ్మాళి మండలం మూలపేట తీరంలో లభ్యమైంది. స్థానికులు సంతబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించగా బందరువానిపేటకు చెందిన గణపతిగా నిర్ధారించారు. గణపతికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఇంటిపై పిడుగు పాటు



పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంలోని పిల్లివీధికి చెందిన దంతం రామారావు ఇంటిపై మంగళవారం పిడుగు పడింది. మొదటి ఫ్లోర్‌పై పిడుగు పడడంతో శ్లాబ్ గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇంటిలో ఉన్న వాళ్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

‘ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి’



మాట్లాడుతున్న అజయ కుమార్ సాహు

జయపురం: మత కలహాలు, వేర్పాటువాదంతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని 2024 ఎన్నికల్లో ఓడించాలని భారతీయ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి అజయ కుమార్ సాహు పిలుపునిచ్చారు. స్థానిక బాబాసాహెబ్ కల్యాణ మండపంలో కొరాపుట్ జిల్లా సహాయ కార్యదర్శి పద్మనాభ ముదులి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై నిప్పులు చెరిగారు. మణిపూర్ అల్లర్లకు బీజేపీ విధానాలే కారణమని దుమ్మెత్తి పోశారు. దేశం విపత్కర పరిస్థితులో కొట్టుమిట్టాడుతోందని, ధరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారని విమర్శించారు. మణిపూర్‌లో జాతి, మత పరమైన హింసలతో 120 మందికి పైగా ప్రజలు మరణించారని, 60 వేలకు పైగా ప్రజలు రిలీఫ్ క్యాంపుల్లో తలదాచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు మణిపూర్ సమస్య పరిష్కరిండంపై దృష్టి సారించలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా దేశాన్ని రక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులు, వామపక్షాలు, కార్మికులు ఒకేతాటిపై నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ కుమార్ మహంతి, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర రౌళో, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఆశిష్ కనుంగో, భద్ర బొడనాయిక్, భైద్యనాథ్ హరిజన్, ఉత్తమ మల్లిక్, జగన్నాథ్ హరిక, సుకాంత గౌఢ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



రాయగడ: అదనపు కలెక్టర్ సోమనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జూలై 11వ తేదీ నుంచి 24 వరకు జనసంఖ్య స్థిరీకరణ పక్షోత్సవాలు జరుపుకుంటున్నట్లు జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ముబారక్ అలీ తెలియజేశారు. స్థానిక 50 పడకల మాతాశిశు ఆస్పత్రిలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ విచ్చేశారు. అంతకుముందు పట్టణంలో జనాభా నియంత్రణపై ఆశవర్కర్లు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా చికిత్స అధికారి రమేష్ మిశ్రా, అదనపు జిల్లా చికిత్సాధికారి డా.నారాయణ మల్లిక్, డా.మహేంద్ర భుయ్యాన్, డీపీఎం సౌమ్య రాణి గౌడో, డా.నేత్రానంద శతపతి తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక జనసంఖ్య సమాధాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంస్థ నాయకులు ఆందోళన చేపట్టారు. అందరికీ సమాన హక్కు, ఇద్దరు కంటే ఎక్కువ సంతానం ఉండేవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్‌కు సమర్పించారు. కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు జోగేశ్వర్ దాస్, బాదల్ కుమార్ థా, దుర్గామాధవ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ప్రపంచ జనాభా దినోత్సవంలో పాల్గొన్న అధికారులు



పర్లాకిమిడి: కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఆశవర్కర్

విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స

– జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి



శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స అనంతరం వివరాల్ని వెల్లడిస్తున్న ముకుందరావు, వైద్య నిపుణులు

కవిటి: ఆరోగ్య శ్రీ పథకం ఆసరాతో శ్రీకాకుళంలో పూర్తిగా జిల్లాకు చెందిన నిపుణుల పర్యవేక్షణలో తొలికిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి నెఫ్రాలజీ వైద్యనిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరావు, డాక్టర్ కొర్ల విద్యాసాగర్ నేతృత్వంలో కిడ్నీ మార్పిడి చేసుకున్న వ్యక్తి కంబాల ముకుందరెడ్డి ఆస్పత్రి వైద్యులకు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. టెక్కలి నియోజకవర్గం నౌపడకు చెందిన ముకుందరెడ్డి ఆరుమాసాల కిందట తీవ్ర అనారోగ్యం పాలై మెడికవర్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అప్పటికే అతనికి కిడ్నీలు పాడైనట్టు వైద్యులు తెలిపారు. దీంతో తక్షణమే అతనికి హీమో డయాలసిస్‌ను వైద్య నిపుణులు సిఫారసు చేశారు.అప్పటి నుంచి అతనికి డయాలసిస్ ప్రక్రియతో వైద్యం అందుతోంది. ఈ నేపథ్యంలో తన తల్లి కిడ్నీ ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో మరోసారి అన్ని వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సను శ్రీకాకుళం మెడికవర్‌లో చేసేందుకు సిద్ధమయ్యారు. అనుకున్నట్టుగానే నెఫ్రాలజీ నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాధరావు, డాక్టర్ కొర్ల విద్యాసాగర్‌ల పర్యవేక్షణలో డాక్టర్ దుంపల హరిప్రసాద్ కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కిడ్నీ మార్పిడి చేసి వారం రోజుల వరకు అతడిని వైద్యులు ఐసీయూ పర్యవేక్షణలో ఉంచారు. కొత్తగా అమర్చిన కిడ్నీ ఫంక్షనింగ్ విజయవంతమైందని మంగళవారం పరీక్షలు చేసి నిర్ధారించారు. సీరం క్రియాటినైన్ 0.99గా రావడంతో అంతటా హర్షం వ్యక్తమైంది. ఇతర ఫలితాలు కూడా సాధారణ స్థితిలో నమోదైయినట్టు డాక్టర్ ఆర్.రంగనాధరావు తెలిపారు. ఈ ఆపరేషన్ ప్రైవేటు ఆస్పత్రిలో చేస్తే రూ.7లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. వారం రోజుల పాటు పరిశీలించి అన్ని రిపోర్టులు బాగున్నాక మంగళవారం డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు. కిడ్నీ దాత బాధితుడికి రక్తసంబంధీకులు అయితే తక్కువ మందుల ఖర్చుతో మార్పిడి ప్రక్రియ సులభం అవుతుందన్నారు. అయితే ఆరోగ్యశ్రీ పథకంలో కిడ్నీమార్పిడి చేసుకున్న ముకుందరెడ్డికి ఏడాదికాలం పాటు పోస్ట్ ఆపరేటివ్ కేర్‌గా మందులు, వైద్యం ప్రభుత్వం ఉచితంగా అందించనుండడం విశేషం.

‘కార్మికుల శ్రేయస్సే మా ధ్యేయం’

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషిచేసిన యూనియన్ ఎంప్లాయీస్ యూనియన్ అని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం పలిశెట్టి దామోదరరావు ఈయూ జెండాను ఆవిష్కరించి 72వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత ఏపీ పీటీడీగా మారిందన్నారు. త్వరలోనే ఈయూ సంఘానికి ప్రభుత్వపరంగా గుర్తింపు లభించనుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

‘సీనియర్ న్యాయవాదులను అనుసరించాలి’



మాట్లాడుతున్న బేణుధర పాత్రో

జయపురం: జూనియర్ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదులను అనుసరించి తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకోవాలని రాష్ట్ర ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ ప్రిసైడింగ్ అధికారి బేణుధర పాత్రో(ఓఎస్‌జేఎస్) సలహా ఇచ్చారు. స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో లేబర్ కోర్టు కొత్త భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో న్యాయవాదులకు తగిన గుర్తింపు లభించడం లేదని, ప్రభుత్వం కూడా న్యాయవాదుల భవిష్యత్తు కోసం ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను న్యాయవాదిగా ఎన్ని ఇబ్బందులు పడింది వివరించారు. తమ హక్కుల కోసం న్యాయవాదులు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. కోర్టుకు వచ్చే కేసులకు ఎక్కువ వాయిదాలు కోరకుండా చూడాలని ఉద్బోధించారు.

లేబర్ కేసుల్లో ప్రతివాదులైన యజమానులు కార్మికుడిని ఇబ్బందులు పెట్టాలని ఎక్కువ వాయిదాలు కోరుతుంటారని, ఎక్కువ వాయిదాలు వలన పేదలైన కార్మికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతారన్నారు. అందువలన కార్మికులు తరఫున న్యాయవాదులు ఎక్కువ వాయిదాలు కోరకుండా కార్మికులకు న్యాయం చేసేందుకు సహాయ పడాలని సూచించారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ బేదబర ప్రధాన్, జయపురం తహసీల్దార్ సాగరిక షాడంగి, కొరాపుట్ జిల్లా, జయపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిరేష్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్ సచేతన రథం ప్రారంభం



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న సోమారీ టాంగులు తదితరులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ వద్ద కల్యాణ్ సచేతన రథాన్ని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టాంగులు మంగళవారం ప్రారంభించారు. ఈ రథం ద్వారా కుటుంబ నియంత్రణ, పిల్లల సంరక్షణపై అవగాహన కల్పిస్తారు. జిల్లాలో ఉన్న 7 సమితిల్లో ఈ రథం 25వ తేదీ వరకు పర్యటించనున్నట్లు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో, అదనపు కలెక్టర్ మహేశ్వర్ చంద్రనాయిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న నాటుసారాతో ఎక్సైజ్ సిబ్బంది

రాయగడ: జిల్లాల్లోని బిసంకటక్ సమితి బెలియాపాడ, బాన్‌పూర్, చాటికొన, గోతిగుడ తదితర ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో 150 లీటర్ల నాటుసారాతో పాటు మరో 2,700 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, అందుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో బెథియాపాడ గ్రామానికి చెందిన సుక్షమ కౌసల్య, కుంభారిదాముని గ్రామానికి చెందిన దామోదర్ కొపల్య ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ జిల్లా శాఖ అధికారి అభిరాం బెహర, హిమాంశు శేఖర్ మల్లిక్, ప్రీతీనాయక్, పంకజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తత అవసరం: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇప్పటి నుంచి డిసెంబర్ వరకు తుఫాన్ల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ముప్పును పసిగట్టి ముందుగానే అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ ఏడాది దక్షిణ, పశ్చిమ రుతుపవనాలకు సంబంధించి జిల్లా అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారులు అందరూ విపత్తులు ఎదుర్కొనేందుకు కావాల్సిన సామగ్రి, సిబ్బందితో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో మరమ్మతు పనులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. వంశధార నదికి సంబంధించి వంశధార ఎస్ఈ డి.తిరుమలరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. మెటీరియల్ అంతా సిద్ధంగా ఉందని తిరుమలరావు వివరించారు. అతి ప్రమాదకర గ్రామాలను గుర్తించి వరద నివారణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌ను ఆదేశించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ రెవెన్యూ, ఇతర శాఖలతో కలిసి ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుకు అన్ని సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. జేసీ నవీన్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని, డివిజినల్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ తహసీల్దార్లకు ముందుగానే సూచనలు అందించామన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో తీసుకోనున్న చర్యలను వివరించారు.


పలాసకు తిరుమలేశుని వలస

- తిరుపతిలో సంతృప్తకర దర్శనం జరగలేదని ఏకంగా ఆలయ నిర్మాణం
- తల్లి చెప్పిన మాట ప్రకారం తిరుమలేశుని గుడి నిర్మాణం
- పలాసలో 12 ఎకరాల్లో చకచకా కోవెల పనులు
- నిరుపేదల కోసం రెండెకరాల్లో కల్యాణ మండపం నిర్మిస్తున్న వైనం
- భక్తిని చాటుకుంటున్న హరి ముకుందా పండా

అమ్మ సూచన తనయుడి ఆచరణ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఓ తల్లి ఇచ్చిన ఆదేశం.. పన్నెండు ఎకరాల ప్రాకారం.. ఐదేళ్లుగా సాగుతున్న నిర్మాణం..తిరుమల నుంచి తెచ్చిన ఏకశిలా విగ్రహం.. వెరసి ఓ భక్తుడి కల నెరవేరుతోందిలా. పదేళ్ల కిందట తల్లి వద్దకు వెళ్లి ‘అమ్మా.. స్వామి దర్శనం సంతృప్తిగా జరగలేదు’ అని చెబితే.. ఇక్కడే తిరుమలను పోలిన గుడి కట్టుకోవచ్చు కదా.. అని తల్లి చెప్పింది. అంతే అమ్మ ఆజ్ఞను పాటిస్తూ ఆయన ఆ తిరుమలేశుని పలాస తీసుకువచ్చే క్రతువుకు శ్రీకారం చుట్టారు. ఐదేళ్లుగా సాగుతున్న ఈ నిర్మాణ క్రతువు ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. ఒడిశా రాజ కుటుంబానికి చెందిన హరి ముకుందా పండా ఈ మహత్కార్యాన్ని నెత్తిన వేసుకుని పూర్తి చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

ఒడిశా రాజకుటుంబానికి చెందిన హరి ముకుందా పండా తల్లి పేరు హరి విష్ణుప్రియ పండా. నిత్యం దైవ ధ్యాసలో ఉంటూ దానధర్మాలు చేస్తుంటారు. ఆమె ఒక్కగానొక్క కొడుకు హరి ముకుందా పండా. పదేళ్ల కిందట ఆయన మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ తిరుమల వెంకన్న దర్శనానికి వెళ్లారు. కానీ స్వామి దర్శనం సంతృప్తికరంగా జరగలేదని తల్లి వద్ద చెప్పుకుని బాధ పడ్డారు. దీంతో ఆ తల్లి తన కుమారుడి ఆవేదనను అర్థం చేసుకుని.. తనకున్న కొబ్బరి తోటలోని 12 ఎకరాల స్థలంలో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టమని చెప్పింది. దాంతో 95 ఏళ్ల వయస్సులో ఉన్న హరి ముకుందా ఐదేళ్ల కిందట నిర్మాణాన్ని ప్రారంభించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అతి పెద్ద పండ్లతోట పండావారి తోటగా ప్రసిద్ధి చెందింది. దానికి యజమాని హరిముకుంద పండా. ఆయనే ప్రస్తుతం అందమైన ఆలయాన్ని నిర్మించి వెంకటేశ్వరస్వామిపై తన దైన శైలిలో భక్తి భావం చాటుకుంటున్న దార్శనికుడిగా చరిత్రలో నిలిచిపోతున్నారు.



హరి ముకుందా పండా

తొంబైలో ఇరవైలా..

వయసు శరీరానికే తప్ప మనసుకు మాత్రం కాదని ఆయన నిరూపిస్తున్నారు. బ్రహ్మ ముహూర్తంలో తెల్లవారి 3గంటలకు లేచి దినచర్యను ప్రారంభించే ఆయన ప్రకృతికి దగ్గరగా ఉంటారు. యోగా ప్రాణాయామంతో పాటు దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు ఆలయానికి వచ్చి రాత్రి నిద్రపోయే వరకు ఆలయం నిర్మాణంలోనే మమేకమవుతున్నారు. మధ్యలో వ్యవసాయ పనులు చేస్తుంటారు. తోటలో ట్రాక్టర్‌ను తానే నడుపుతూ అన్ని పనులు చేసి పూర్వపు ఆహార అలవాట్లు పాటిస్తున్నారు. ప్రతి రోజూ కేవలం ఒక్కసారి మాత్రమే భోజనం చేస్తారు. ఎలాంటి మందులు వాడకుండా పండించే వివిధ రకాల పండ్లను కొనుగోలు చేయడానికి ఆయన తోట వద్ద క్యూ కడుతుంటారు. పన్నెండేళ్ల వయస్సులో స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఈయనొక కొడుకు ఉన్నారు. ఆయన వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. హరి ముకుంద తర్వాత ఆలయ బాధ్యతలు కొడుకే చూసుకోనున్నారు.

రూ.5 కోట్లకుపైగా నిధులతో..

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వందలాది దేవతా మూర్తుల విగ్రహాలతో అద్భుతమైన కట్టడాలకు చిరునామాగా పలాస మారనుంది. అందుకు ఒక్క రూపాయి చందా తీసుకోకుండా తిరుమలలో ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహంతో సమానమైన ఏకశిల విగ్రహాన్ని (తొమ్మిదిఅడుగుల) తయారు చేయించి తిరుపతి నుంచే తెప్పించారు. ఆలయంలో ప్రత్యేకతలు ఒడిశా సంప్రదాయానికి దగ్గరగా ఉంటాయి. ఒడియా బ్రాహ్మణ కుటుంబానికి చెందిన హరి ముకుందా పండా వయసుమీద పడుతున్నా హైందవ ధర్మంపై అపారమైన నమ్మకంతో ఈ యజ్ఞానికి పూనుకున్నారు. 12 ఎకరాల్లో నిర్మిస్తున్న ఆలయంలో కోనేరును సైతం నిర్మిస్తున్నారు. దానికి ఎదురుగా నిరుపేదల పెళ్లిళ్లకు ఉపయోగపడే విధంగా రెండు ఎకరాల్లో కల్యాణమండపం నిర్మించి టీటీడీకి అందివ్వనున్నారు. ఇప్పటికే రెండెకరాలు భూమిని టీటీడీకి రాసేశారు.



పింఛన్లు అందజేస్తున్న హరి ముకుందా పండా



పలాసలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయం

వారానికి లక్షల్లో పింఛన్లు పంపిణీ..

ఒక్క దేవాలయం నిర్మాణంతోనే తన ఔదార్యాన్ని పరిమితం చేయలేదు. తన వద్దకు వచ్చే ఎంతోమంది పేదవాళ్లకు సాయం కూడా చేస్తున్నారు. ఆంధ్రా-ఒడిషా సరిహద్దే కాకుండా రాష్ట్రంలో, దేశంలో ఏ మూలనుంచి వచ్చినా వారానికి ఒక్కసారి కడుపు నిండా భోజనం పెట్టి.. దివ్యాంగత్వాన్ని బట్టి పింఛన్లు అందిస్తున్నారు. ప్రతి సోమవారం పండాతోట నుంచి పలాస రైల్వేస్టేషన్‌కు ఒక ప్రత్యేక ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి దివ్యాంగుల రాకపోకలకు సౌకర్యం కల్పిస్తున్నారు. వారానికి 200మందికి భోజనంతో పాటు రూ.లక్షల్లో పింఛన్లు అందజేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రాలేనివారికి ఏడాదికి రూ.10వేలు డిపాజిట్ చేస్తున్నారు. రెండు కాళ్లు, రెండు కళ్లు లేనివారికి మాత్రమే ఇవి అందిస్తున్నారు. ఏనాడూ ప్రచారాలకు పోకుండా... రాజకీయాలకు దూరంగా ఉంటూ సేవ చేస్తున్నారు.



ఆలయ లోపల భాగం

క్లుప్తంగా

ఏనుగుల సంచారంతో ఆందోళన



అరసాడ వద్ద తోటల్లో ఉన్న ఏనుగులు

బలిజిపేట: మండలంలోని అరసాడ, మురగడాం, అజ్జాడ గ్రామాల హద్దుల్లో ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గరుగుబిల్లి మండలం పెద్దూరు నుంచి 7ఏనుగుల గుంపు వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మురగడాంలో కొంతమంది రైతుల ఆకుమడులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఏనుగులు సంచరిస్తుండడంతో పొలాలకు వెళ్లలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే పంపించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయాలపాలైన శ్రీనివాసరావుకు చినమేరంగి హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో తీసుకువచ్చిన దృశ్యం

జియ్యమ్మవలస: టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద ఢీకొనడంతో ఇద్దరూ గాయాలపాలయ్యారని ఎస్సై కళాధర్ తెలిపారు. మంగళవారం జరిగిన టీడీపీ ర్యాలీలో పాల్గొన్న చింతలబెలగాం గ్రామానికి చెందిన ఎం.తిరుపతిరావు, ఎం శ్రీనివాసరావులు పెదమేరంగి కూడలి నుంచి చినమేరంగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టడంతో ఇద్దరూ ఎగిరిపడగా శ్రీనివాసరావు తలకు బలమైన గాయమైంది. చినమేరంగి హాస్పటల్‌కు ఇద్దరినీ తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీనివాసరావును0 పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న తాతబాబు

పార్వతీపురం: సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన గొట్టాపు తాతబాబు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలంలోని రావివలస గ్రామంలో అమ్మవారి ఉత్సవాలకు హాజరయ్యేందుకు కుటుంబసభ్యులతో కలిసి అత్తవారింటికి తాతబాబు మంగళవారం వెళ్లాడు. సాయంత్రం రావివలసనుంచి పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చాడు. 15రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న తాతబాబు ఆరోగ్యం సహకరించడంలేదని మనస్తాపం చెంది ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయాన్ని భార్యకు ఫోన్ చేసి తెలియజేయగా, ఆమెతో పాటు కుటుంబసభ్యులు వచ్చి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

193 లీటర్ల సారా పట్టివేత



పట్టుకున్న సారాను చూపిస్తున్న పోలీసులు

సాలూరు: పట్టణంలో మంగళవారం ఉదయం నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో భాగంగా 193 లీటర్ల సారా పట్టుకున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. రెల్లివీధి, పెద్దవీధిలలో, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన సీఐలు, ఎస్సైలు ,ప్రత్యేక పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. 193 లీటర్ల సారా పట్టుకుని ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

శాకంబరిగా పోలమాంబ



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు, పోలమాంబ అమ్మవారి మేనత్త పెదపోలమాంబ అమ్మవారు మంగళవారం శాకంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అషాడమాసాన్ని పురస్కరించుకుని 40 రకాల కూరగాయలతో అమ్మవార్లను అలకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితుడు ఆరవెల్లి విజయకుమార్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ రాధాకృష్ణ, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీ సభ్యులు పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టులైన తోటపల్లి, తారకరామ తీర్థసాగర్, బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి భూసేకరణ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆమె తన చాంబర్‌లో భూసేకరణపై జేసీ మయూర్ అశోక్‌తో కలిసి సమీక్షించారు. తోటపల్లి ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్యాకేజ్–2 పనులు ప్రారంభమయ్యాయని, అయితే తెర్లాంలో డీ-పట్టా భూములు ఇస్తున్న రైతులకు ఇచ్చే పరిహారం ఎంత అనే అంశాలపై రైతులకు రాత పూర్వకంగా వివరాలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. చెల్లింపులు కూడా వేగంగా జరిగేలా చూడాలన్నారు. తారక రామతీర్థ సాగర్‌కు సంబంధించి ఆర్అండ్ఆర్ పనులు 6 నెలల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కోర్టు కేసులపై జీపీతో మాట్లాడి త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. తారక రామ తీర్థసాగర్ నుంచి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు తాగునీరు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు నీటి సరఫరా చేయవలసి ఉన్నందున పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి సంబంధించి 5,167 ఎకరాలను సేకరించాల్సి ఉందని త్వరగా సేకరణ పూర్తిచేసి అవార్డులు పాస్ చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు సూర్యకళ, అప్పారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, వెంకటేశ్వరరావు, సుదర్శన దొర, సూర్యనారాయణ, ఆర్ అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, సంబంధిత ప్రాజెక్టుల ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

శుచికర ఆహార తయారీపై వీధివ్యాపారులకు శిక్షణ



ధ్రువీకరణ పత్రాలను ఆవిష్కరిస్తున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: వినియోగదారులకు పరిశుభ్ర వాతావరణంలో శుచికరమైన పద్ధతుల్లో ఆహారాన్ని తయారుచేసి అందించడం ద్వారా వారి ఆదరణ పొందితే హోటల్ వ్యాపారంలో వృద్ధి చెందడం సాధ్యపడుతుందని జేసీ మయూర్ అశోక్ అన్నారు. వీధుల్లో, రోడ్డు పక్కన ఉండే హోటళ్లలో లభించే ఆహారం పరిశుభ్రంగా ఉండదని, ఆరోగ్యానికి మంచిది కాదనే భావనను ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం ద్వారా ప్రజల్లో పోగొట్టాలని వీధి వ్యాపారులకు జేసీ పిలుపునిచ్చారు. భారత ఆహార ప్రమాణాల సంస్థ, వీధి వ్యాపారుల జాతీయ సంస్థ, ఆహార కల్తీ నిరోధక విభాగంతో కలిసి సురక్షిత ఆహారాన్ని అందించడం అనే కార్యక్రమంలో భాగంగా నగరంలోని వీధి వ్యాపారులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణకార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి హోటళ్లలో లభించే ఆహారం రుచికరంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రజలు ఈ హోటళ్లలో ఆహార పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నారని, ప్రజలు ఉంచిన నమ్మకాన్ని కాపాడుకునే విధంగా తమ హోటళ్లను పరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తూ ఆహారాన్ని తయారుచేయడంలో శుచికరమైన పద్ధతులు పాటించాలని హితవు పలికారు. అప్పుడే ఆ హోటల్ ప్రజాదరణ పొంది వ్యాపారం అభివృద్ధి చెందుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న విధానాలను రోజువారీ వ్యాపారంలో పాటించడానికి ప్రయత్నించాలని కోరారు. వీధి వ్యాపారులు శుచికరమైన విధానాలను అవలంబిస్తే వారికి ప్రభుత్వ పథకాల కింద రాయితీలు, తక్కువ వడ్డీకి రుణాలు వంటి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ప్రతి వ్యాపారి సర్టిఫికెట్ కలిగి ఉండాలి

దేశంలోని ప్రతి ఒక్కరికీ సురక్షిత ఆహారాన్ని అందించే ఉద్దేశంతో భారత ఆహార ప్రమాణాల సంస్థ (ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ) ఈ కార్యక్రమం చేపడుతోందని ఆహార కల్తీ నిరోధకశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి తెలిపారు. ప్రతి ఒక్క వీధివ్యాపారి ఈ సర్టిఫికెట్ కలిగి ఉండాలని వ్యాపార నిర్వహణకు ఇచ్చిన సర్టిఫికెట్‌ను హోటల్ ముందు ప్రదర్శించాలని స్పష్టం చేశారు. పరిశుభ్రకర పద్ధతుల్లో ఆహారాన్ని తయారు చేయడంపై వీధివ్యాపారులకు ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థ నెస్లే సహకారంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఇచ్చే సర్టిఫికెట్లను జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది కొండపల్లి శ్రీనివాసరావు, కిలపర్తి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వినియోగదారుల కమిషన్ జడ్జి ఆర్ వీనాగసుందరం, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

అందరి కృషితోనే పర్యావరణ పరిరక్షణ



కాటన్ సంచులను అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ ఎం.దీపిక పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణానికి విఘాతం కలిగించే వస్తువుల వినియోగాన్ని నియంత్రించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి ఆధ్వర్యంలో కాటన్ సంచుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి. డాక్టర్ తిరుమల ప్రసాద్, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో 300 మంది మహిళా పోలీసు ఉద్యోగులకు తిరుమల ఆస్పత్రిలో ఉచితంగా వైద్యపరీక్షలు, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ వి.సుభద్ర, డాక్టర్ బంటిన, డాక్టర్ మహేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ జ్యోతి, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి లడ్డూలు, అరిసెలు, పనస తొనలు నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పైడితల్లి దీక్షా ఏర్పాట్లపై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం

- పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో



అమ్మవారి దీక్ష పత్రాలను గురుస్వాములకు అందజేస్తున్న కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి దీక్షలు ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో జిల్లాలోని వివిధప్రాంతాల్లో అమ్మవారి పీఠాలు ఏర్పాటు చేసే గురుస్వాములతో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నిర్వహించే విధంగా అమ్మవారి దీక్షలను ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో దీక్షాపరులు వచ్చే విధంగా భక్తి భావాన్ని ప్రజల్లో పెంపొందించేలా చూడాలన్నారు. అందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్నిప్రాంతాల్లో ప్రచార రథం తిరిగేలా చర్యలు చేపడతామన్నారు. అమ్మవారి దీక్షలు చేయాలనుకునే భక్తులందరూ నేరుగా తమను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటుపై అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీను, సత్తి అచ్చిరెడ్డి, మహేష్, శివకుమార్, చిప్పాడ నాని, కొమ్మ కనకారావు, వెలగాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

- 8 కిలోల కణితిని తొలగించిన సాయి ఆస్పత్రి వైద్యులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

విజయనగరం ఫోర్ట్: కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేసి సుమారు 8 కిలోల కణితిని బయటకు తీసి ప్రాణాలు కాపాడామని సాయిసూపర్ స్పెషాలిటీ ఎం.డి డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రణస్థలానికి చెందిన 58 ఏళ్ల సూరమ్మ కొన్నాళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతోందని, ఇటీవల ఆమె ఆస్పత్రికి రాగా సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ఝాన్సీ తనిఖీ చేసి ఆస్పత్రిలో చేర్పించి శస్త్రచికిత్స చేసి కణితి తొలిగించారన్నారు. ఈ శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా చేశామని తెలిపారు. కార్యక్రమంలో మత్తు వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని బొల్లినేని మెడికల్ స్కిల్‌లో ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్(ఏ గ్రూపైనా) చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. డిప్లమో ఇన్ అనస్థీషియా, ఎంఎల్‌టీ, రేడియాలజీ, ఆఫ్తమా టెక్నీషియన్, ఆఫ్తమా ట్రీ అసిస్టెంట్, కార్డియాలజీ, క్యాత్‌ల్యాబ్, డయాలసిస్, హెల్త్ అసిస్టెంట్ తదితర 14 పారామెడికల్ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. కన్వీనర్ కోటా కింద ఈ నెల 24 వరకూ, మేనేజ్‌మెంట్ కోటా కింద ఆగస్టు 24 వరకూ ప్రవేశం పొందేందుకు అవకాశముందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆసుపత్రి (76809 45357, 7995013422)లో సంప్రదించాలన్నారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన లోకేష్ (ఫైల్)

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శివరాం గ్రామంలో విద్యుత్ షాక్ కొట్టి గ్రామానికి చెందిన విద్యార్థి పూతి లోకేష్(14) మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని పొలాల సమీపంలో లోకేష్ ఆటలు ఆడుకోవడానికి మంగళవారం మధ్యాహ్నం వెళ్లాడు. ఈ క్రమంలో పొలాల్లో వేలాడుతూ ఉన్న విద్యుత్‌వైరును పట్టుకోవడంతో షాక్ తగిలి మృతి చెందాడు. ఈ విద్యార్థి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మృతుడు లోకేష్ తల్లిదండ్రులకు రెండో కుమారుడు. లోకేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో కార్మికుడు..



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన పైడితల్లి

మండలంలోని నాగంపేట వద్ద ఏపీఈపీడీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ నిర్వహణ పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొండములగాం గ్రామానికి చెందిన బొంతు పైడితల్లి(45) మృతి చెందాడు.ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. 11కేవీ విద్యుత్‌లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసే క్రమంలో ఎల్‌సీ తీసుకోవాలని లైన్‌మన్ చెప్పడంతో పైడితల్లి స్తంభం ఎక్కాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తోటి కార్మికులు వెంటనే చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



స్విమ్మింగ్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న దృశ్యం



స్వామినాయుడిని అభినందిస్తున్న హెచ్‌ఎం పుష్పమేరీ

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 8,9 తేదీల్లో పల్నాడు జిల్లా నర్సారావుపేటలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఒక బంగారు పతకం, 3 వెండి పతకాలు, 4 కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్‌వేణుగోపాలరావులు అభినందించారు. త్వరలో ఒడిశాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు జి.ఆదిలింగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ విజేత స్వామినాయుడు

విజయనగరం ఫూల్‌బాగ్: ఈనెల 8,9 తేదీల్లో పల్నాడు జిల్లా నర్సారావుపేటలో జరిగిన 8వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ సబ్‌జూనియర్ పోటీల్లో జిల్లాకు చెందిన సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్ ఐదవ తరగతి విద్యార్థి బలగ స్వామినాయుడు విజయకేతనం ఎగురవేశాడు. ఈ సందర్భంగా ఒక బంగారుపతకం, రజతపతకం, రెండు కాంస్య పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ పుష్పమేరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వామినాయుడిని అభినందించారు.

జనాభా నియంత్రణ చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: అధిక జనాభాతో పేదరికం పెరుగుతోందని, జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాధరావు కోరారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎన్‌జీఓ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వ్యాసరచనలో గెలుపొందిన విద్యార్థులకు, చక్కని పనితీరు కనబరచిన డాక్టర్లు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జనాభాను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. జానాభా పెరిగితే అభివృద్ధికి కేటాయించవలసిన నిధులను ప్రజలందరికీ కనీస అవసరాలు తీర్చేందుకు సంక్షేమ పథకాలకు ఖర్చుచేయడం వల్ల ఆర్థికాభివృద్ధి కుంటుబడుతుందని చెప్పారు. జిల్లాలో ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాధారణ ప్రసవాలు నిర్వహిస్తున్నామని, పిల్లల మధ్య ఎడం పాటించడం, బాల్య వివాహాలు నిరోధించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తక్కువ మంది పిల్లలకు జన్మనివ్వడం ద్వారా వారికి మంచి జీవితాన్నందించవచ్చునని, మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి మాట్లాడుతూ జిల్లాలో ఎనభై శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలను తప్పనిసరిగా బడికి పంపించాలని, వారికి పరీక్షలు నిర్వహించి రక్తహీతన గల వారిని గుర్తించి ఐరన్ మాత్రలు అందజేస్తామని చెప్పారు. జనాభా నియంత్రణకు బాల్యవివాహాలు నిరోధించడం, పిల్లల మధ్య ఎడం పాటించడం చేయాలని, మాతా శిశు మరణాలను తగ్గించడం ద్వారా ఎక్కువ మందికి జన్మనివ్వకుండా అవగాహన కల్పించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్ ప్రోగ్రాం ఆఫీసరు దవళ భాస్కరరావు, డాక్టర్ విజయ మోహన్, డాక్టర్ వినోద్ జనాభా పెరుగుదలతో వచ్చే విపత్తులు, నివారణ చర్యల గురించి ప్రసంగించారు.

నగదు బహుమతుల ప్రదానం

అనంతరం పీపీఐయూసీడీ అంగీకరించిన బొత్స జాన్సీ, వై.యామినిలకు రూ.అయిదువేలు చొప్పున, వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న నిమ్మక ధనుంజయకు రూ.అయిదువేలు నగదు బహుమతి అందించారు. వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గైనకాలజీ విభాగంలో డాక్టర్ బి.వాగ్దేవి, డా. సీహెచ్ కమలాకుమారిలకు రూ. ఏడువేలు చొప్పున, వేసెక్టమీ విభాగంలో డాక్టర్ ఎ.విజయ రూ.నాలుగువేల బహుమతి అందుకున్నారు. అలాగే వివిధ విభాగాల్లో పలువురు వైద్యసిబ్బంది ప్రశంసలు, బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'సాగరకవచం'



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: సముద్ర మార్గం ద్వారా వచ్చే ఉగ్రవాదులను నిలువరించేందుకు ఏటా తీరప్రాంతంలో ఏటా సాగరకవచం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం, గురువారం భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో రెండురోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ గోవిందరావు సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సముద్ర మార్గం గుండా చొరబాట్లను అడ్డుకునేందుకు నిఘా పటిష్టం చేశామన్నారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు రెండు మండలాల్లోని 17 మత్స్యకార గ్రామాలతో పాటు ముఖ్యమైన ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మెరైన్ సీఐ వైకుంఠరావు, భోగాపురం సీఐ కేవీవీ. విజయనాథ్, ఎస్సైలు కృష్ణమూర్తి, మహేష్, శ్రీనివాసరావు, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేస్తాం

- మంత్రి బొత్స సత్యనారాయణ
- ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన



రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రులు

రాజాం: భవిష్యత్తులో రాజాంలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాజాం పట్టణంలోని రైతు బజార్ పక్కన ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్‌తో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి బ్లూ ప్రింట్ పరిశీలించారు. కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రస్తుతం కేటాయించిన స్థలంపై చీపురుపల్లి ఆర్డీఓ అప్పారావు, తహసీల్దార్ ఎస్.కె.రాజుకు అడిగి తెలుసుకున్నారు. మరో 3 ఎకరాలు ఇక్కడే కేటాయిస్తే డిపో కూడా ఏర్పాటుచేస్తామని చెప్పారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నాన్ని నెరవేరుస్తూ, రాజాంకు సొంత బస్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రూ.1.48 కోట్ల ఖర్చుతో 1.42 ఎకరాల విస్తీర్ణంలో 10 ప్లాట్‌ఫారాలతో నూతన బస్ స్టేషన్‌ను నిర్మించనున్నామని వెల్లడించారు. రోజుకు 126 బస్సులు, సుమారు 450 ట్రిప్పులతో ప్రతిరోజూ దాదాపు 25 వేలమంది రాకపోకలకు వీలుగా నిర్మాణం సాగిస్తామని చెప్పారు. తొమ్మిది నెలల వ్యవధిలో నిర్మాణం పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఎం.డి.ద్వారకా తిరుమలరావు, చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జోనల్ చైర్మన్ బంగారమ్మ, విజయనగరం జోన్ ఈడి సి.రవికుమార్, మూడు జిల్లాల ప్రజా రవాణా అధికారులు ఎ.విజయ్‌కుమార్, కె.వెంకటరావు, సీహెచ్ అప్పలనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు పాల్గొన్నారు.